విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 11, జనవరి 2025

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి...

- చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలి
- ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఇంటి స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

విశాలాంధ్ర-అనంతపురం: పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ పేర్కొన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ పార్టీ పిలుపుమేరకు శుక్రవారం అనంతపురం సంగమేశ్వర సర్కిల్ నుండి నిరుపేద లబ్ధిదారులతో ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు, నిర్మాణానికి రూ.4 లక్షల ఇస్తామని చెప్పిందన్నారు. వారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న పేదోళ్ల ఇంటి పట్టాల విషయాలపై ఎటువంటి చర్చ జరగడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు 6 కోట్లు వస్తాయి పరిశ్రమలు, రోడ్లు, ఫ్లై ఓవర్లు, తీసుకొస్తామని చెప్తున్నాడన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు ప్రజలంతా పుణ్యం వస్తుందని దేవాలయాల్లో కూర్చుంటే పేదోడి ఇంటి కోసం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాల్లో కూర్చోడం జరుగుతోం దన్నారు. నగరాల్లో గ్రామీణ స్థాయిలో పేద ప్రజలకు ఇంటి పట్టాలతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం పోరాడిన పార్టీ ఏకైక సిపిఐ పార్టీ అని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. కలెక్టరేట్ వద్ద కలెక్టర్లకు దరఖాస్తులు ఇవ్వడమే కాకుండా అనంతరం వారు ఇచ్చిన జాబితాలను తీసుకొని ఎమ్మార్వోకి అందజేసే కార్యక్రమంలో నాయకులతో పాటు ప్రజలు పాల్గొనాలన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు పోరాడుతామన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, కేశవ రెడ్డి, రామకృష్ణ,నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు రమణ, అలిపిర, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, పద్మావతమ్మ తలారి నారాయణస్వామి, సంతోష్‌కుమార్, రాజేష్, చిరంజీవి, పెద్దయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్ళయ స్వామి, ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్,హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, నగర కార్యవర్గ సభ్యులు సుందర్రాజు, మునాఫ్,జానకి, నారాయణస్వామి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు నగర అధ్యక్ష కార్యదర్శులు ఖజా మొహుద్దీన్, చాంద్ బాషా, రాప్తాడు సింగనమల అనంతపురం లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిమ్మకునీరెత్తినట్టు ఉండటం ఏమిటి..?

విశాలాంధ్ర-ఉరవకొండ: కూడేరు మండల తాహసిల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారం లోకివచ్చి 6 నెలలు పూర్తికావస్తున్నప్పటికి. ఇళ్ల స్థలాలు గురించి మాట్లాడకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికి గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు కోకొల్లలుగా ఉన్నారని వెంటనే అర్హత కలిగిన పేదలకు స్థలాలతో పాటు ఇళ్ల నిర్మిచాలని డిమాండ్ చేశారు. పేదలకు విద్యుత్ చార్జీలు పెంచి నడ్డి విరుస్తున్నారాన్నారని పెంచిన విద్యుత్. చార్జీలు వెంటనే ఉపసంహరించాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ, వ్యకాసం నాయకులు రమణప్ప, సుల్తాన్, మలరాయుడు, మంచినీళ్ల ప్రసాద్, ధనరాజు, వెంకటేష్, అంజనేయులు భీమన్న, వరలక్ష్మీ, లతా పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-పెద్దపప్పూరు: పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తాహసిల్దార్ కార్యాలయం వద్ద పేదలకు ఇంటి స్థలాల మంజూరు చేయాలని నిరసన తెలిపి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన పేద ప్రజలు ఇండ్లు లేక ఇంటి స్థలాలు లేక చాలా అవస్థలు పడుతున్నారని, గత ప్రభుత్వం నిరుపేదలను పట్టించుకోలేదని అందుకే ఆ ప్రభుత్వానికి చరమగీతం పాడి కూటమి ప్రభుత్వానికి గెలిపించారు. ప్రజలు కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందని నమ్మకంతో చెబుతున్నాం. ఇప్పుడున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నిరుపేదలకు ఇంటి స్థలాలు మూడు సెంట్లు ప్రకారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ మాదిగ పెద్దపప్పూరు మండల సిపిఐ కార్యదర్శి చింతా పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర- రాయదుర్గం అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వాలని శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వము ఇంటి స్థలాలు లేనివారికి ఒకటి కాల్ సెంటు ఒక సెంటు ఇచ్చి అవి కూడా అరకొరగా ఇచ్చి కేవలం గృహ నిర్మాణానికి 1,80,000 ఇచ్చి చేతులు దులుపుకుంది గతంలో ఇచ్చిన ఆ సెంటు స్థలంఆ డబ్బు గృహ నిర్మాణానికి సరిపోకచాలామంది తట్టుకోలేకపోయారు కావున ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు పల్లెలో మూడు సెంట్లు అదేవిధంగా గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, సిపిఐ మండల కార్యదర్శి దుర్గన్న, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, సిపిఐ నాయకులు డి మారెన్న, గంగారాం, వెంకటేశులు, షేక్ పీరా, తేజ, మంతేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీని నిలుపుకోవాలి

విశాలాంధ్ర-తాడిపత్రి : పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తాసిల్దార్ రజాక్ వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాము అధికారం లోకి వస్తే సొంత ఇల్లు లేని వారికి పట్టణాలలో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు, ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు ఇండ్లు లేని పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు, శ్రీరాములు, రామంజి, నాగేంద్ర, అబ్రహం, నాయక్, రత్నమయ్య పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం - పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించిబీ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్ ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాలలో కేటాయించారన్నారు. అందులో చాలామందికి ఇప్పటివరకు ఇళ్లస్థలాలు చూపలేదన్నారు. కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాలపట్ల సుముఖత చూపలేదు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం రూ.1,80,000/-లు మాత్రమే ప్రకటించారనిచ, ఆ సహాయంతో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి హామీ నెరవేర్చాలని, రూ. 5 లక్షలకు పెంచి గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని, సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తగు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పోలారంగ స్వామి హుస్సేన్ పీరా, రంగనాయకులు, అల్లాబకాష్, నారాయణ స్వామి, ఆది రంగారెడ్డి రంగస్వామి రంగనాయకులు రామాంజినేయులు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.2

పేదలకు ఇంటి పట్టాలివ్వాలని డీఆర్ఓకు అర్జీ అందజేత

విశాలాంధ్ర-అనంతపురం: పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి కలెక్టరేట్లోని ఆర్డీవో కార్యాలయంలో డీఆర్ఓ మాలోలకు పేద ప్రజల నుంచి ఇంటి పట్టాల కోసం తయారుచేసిన దరఖాస్తులను అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గ్రామ స్థాయిలో 3 సెంట్లు, నగర స్థాయిలో రెండు సెంట్లు, ఇస్తామని తెలియజేశారు అన్నారు. ఇందులో భాగంగా అనంతపూర్, సింగనమల, రాప్తాడు నియోజకవర్గం నుంచి పట్టాల కోసం అర్జీలను ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్పందిస్తూ త్వరలోనే ఒక నివేదిక తయారు చేసి ఎమ్మార్వోలకు అందజేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, నగర కార్యదర్శి శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి అలిపిరా, రమణయ్య, చిన్నప్ప యాదవ్, పెద్దయ్య, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర సమితికి నగర్ సమితి రూ.లక్ష అందజేత

విశాలాంధ్ర-అనంతపురం: సిపిఐ శత వార్షికోత్సవ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు సిపిఐ నగర్ సమితి కార్యదర్శి శ్రీరాములు శుక్రవారం రూ.లక్ష నగదును శుక్రవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... అనంతపురం నగర సమితి ఆధ్వర్యంలో లక్ష రూపాయల సభ్యత్వ నగదును అందజేయడం అభినందనీయం అన్నారు. నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. నగరంలోని నగర్ సమితి ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు కలిసి సభ్యత్వం లక్ష రూపాయలు సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ చేతుల మీదుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కేరామకృష్ణకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, ఇన్సాఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఖజా హుస్సేన్, చాంద్ భాష, రాష్ట్ర అధ్యక్షులు సిపిఐ నగర కార్యదర్శి అలిపిర, రమణయ్య, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఏ కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లో పడి బాలుడు మృతి

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: బుక్కరాయ సముద్రం మండల పసులూరు గ్రామం దుబ్బప్ప గారి ఓబులేసు, అంజనమ్మ దంపతుల మూడవ కుమారుడు దుబ్బ ప్రసాద్ (10) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో ప్రసాద్ ఆడుకోవడా నికి కాలనీ దగ్గర్లో ఉన్న కమ్మగడం క్వారీలో వెళ్ళాడు. స్నేహితులతో కలిసి ఈత కొట్టాలని క్వారీలో నీటి నిల్వ కోసం పెద్ద ఫారం ఫండ్ గుంతలో దిగారు. ప్రసాద్‌కు ఈతకొట్టడం పూర్తిగా రాకపోవడంతో నీట మునిగి మృత్యువాత పడ్డాడు. బాలుడి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రాయదుర్గం విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు..

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024-25 పోటీలో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేష్ ప్రశంసలు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కళాశాల నుండి ఎంపికైన రెండు ప్రాజెక్టులు నారా లోకేష్‌ను ఆకట్టుకున్నందున ప్రభుత్వం తరఫున ఈ ప్రాజెక్టు ఐడియాలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్య కారణమైన కళాశాల లెక్చరర్స్, ప్రాజెక్టు మెంటర్స్ ఎల్.హర్ష, అలీషా కలాం,షేక్ షబానాను ఆయన అభినందించారు. విద్యార్థులు గెలుచుకున్న రూ.10 వేలను వారి చేతికి అందజేశారు.

ఒప్పందాలను అమలు చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: మున్సిపల్ కార్మికులు శుక్రవారం కార్యాలయం ముందు యూనియన్ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ పరిమితి 62 కు పెంచాలని, కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని,సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సిఐటియు నాయకులు అచ్యుత్ ప్రసాద్, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడితే చర్యలు

విశాలాంధ్ర-నార్పల : మండలంలో ఎక్కడైనా కోడిపందాలు పేకాట పాడితే చర్యలు తప్పవని నార్పల ఎస్ఐ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నిలుపుదల హర్షణీయం

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: హంద్రీనీవా కాలువ రెండవ దశ పనులకు చేపట్టబోయే కాలువ లైనింగ్ పనులను ప్రభుత్వం నిలుపుదల చేయడం పట్ల ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను చేపట్టకూడదని హంద్రీనీవా కార్యాలయం ఎదుట, జిల్లా వ్యాప్తంగా వివిధ రూపాలలో రైతులను సమీకరించి ఉధృతంగా చేపట్టిన ఆందోళనలు, రైతాంగానికి జరిగే నష్టంపై పోరుబాట సాగించామన్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం రైతుకు సానుకూలంగా లైనింగ్ నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేయడం హర్షిస్తున్నాము. ఈ కాలువకు లైనింగ్ పనులను చేపడితే జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి తద్వారా బోరు బావుల్లో నీరు ఇంకిపోయి రైతాంగం నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇందు కోసం జిల్లా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత లేకుండా పోతుందన్నారు. జిల్లాలో హంద్రీనీవా కాలువ వచ్చిన తర్వాత భూగర్భ జలాలు పెరిగి వేలాది మంది రైతులు పంటలు పండించుకుంటున్నారని, అలాంటి ప్రాజెక్ట్ కు, నష్టం కలుగుతుందన్నారు. లైనింగ్ పనులు ఆపాలని రైతాంగంతోపాటు రైతు సంఘం, పత్రికలు అందరూ వ్యతిరేకించడం జరిగిందన్నారు. భవిష్యత్తు లో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి జిల్లా ఆయకట్టును స్థిరీకరించి పంట పొలాలకు నీరు అందించాలని కోరారు.

ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు అదనంగా వంద ఎకరాలు

–కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-రాప్తాడు : మండలంలోని గొందిరెడ్డి పల్లి వద్ద ఉన్న ఏపీఐఐసి పరిధిలో 100 ఎకరాల్లో అదనంగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించి ఇందుకు సంబంధించిన భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదనంగా 100 ఎకరాల్లో అదనంగా ఏర్పాటు చేసే ఎంఎస్ఎం ఈ పార్క్‌లో రోడ్, ఎలక్ట్రిసిటీ, డ్రైన్ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇందులో భాగంగా గ్రౌండ్ వాటర్ పరిస్థితి ఎలా ఉంది, ఎంత స్థలం అందుబాటులో ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎస్ఎంఈ పార్క్‌లో ఉన్న కొన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.విజయకుమారి, ఏపీఐఐసి మేనేజర్ సాగర్, సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ కరుణాకర్, వీఆర్ఓలు చక్రధర్, లక్ష్మీనారాయణ చౌదరి, సాయి, సచివాలయ సర్వేయర్లు సాయి, గంగాధర్, ఖలందర్ తదితరులుపాల్గొన్నారు.

కన్నయ్య నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన
సిపిఐ నేత సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-యాడికి : హైదరాబాదులోని కన్నయ్య నాయుడుని ఆయన నివాసంలో శుక్రవారం సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి చెందిన విశ్రాంత ఇంజనీర్ సాంకేతిక సలహాదారుడు ఆయన ప్రధానంగా దేశంలోని నీటిపారుదల ప్రాజెక్టులలో గేట్లు ఏర్పాటు చేయడం, మరమ్మతు చేయడంలో ప్రసిద్ధి చెందారు. ముఖ్యంగా ఆగస్టు 2024లో తుంగభద్ర జలాశయం లో వరదలకు కొట్టుకుపోయిన క్రస్టు గేటు స్థానంలో కేవలం వారం రోజుల్లోనే స్టాప్ లాక్ ఏర్పాటుచేసి నీటిని వృధా కాకుండా సాగునీరు, తాగునీరు గేటు ఏర్పాటు చేసి కరువు జిల్లా అనంతపురం జిల్లాను ఆదుకున్నారన్నారు. సందర్భంగా ఆయనకు సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముదిగల్లులో నిత్యం చిరుత సంచారం..

భయాందోళనలో గ్రామస్తులు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో ప్రతిరోజు చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. శుక్ర వారం ఉదయం 7 గంటల సమయం లోనే కొండలో నుంచి ఇళ్ల వైపు వస్తున్న చిరుతను చూసి గ్రామస్తులు భయాందోళ నకు గురయ్యారు. గ్రామస్తులు మాట్లా డుతూ కొండకు ఆనుకుని మా నివాస గృహాలు ఉన్నాయని, వ్యవసాయంలో పూర్తిగా నష్టపోయి రూ.లక్షల్లో అప్పు చేసి బతుకుతెరువు కోసం గొర్రెలను మేకలను పెంచుకొని జీవనం సాగిస్తున్నా మన్నారు. మా గ్రామానికి ఇరువైపుల కొండలు ఉండడంతో కొన్ని సంవత్సరాలుగా చిరుతలు కొండలలో నుంచి మా ఇల్లు దగ్గరికి వచ్చి గొర్రె పిల్లలు మేక పిల్లలు, ఆవు దూలను ఎత్తుకెళుతున్నాయన్నారు. గత 15 రోజు లలోనే నాలుగైదుసార్లు గొర్రె పిల్లలను చిరుతలు ఎత్తుకెళ్లాయని మా బాధను ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. అటవీ శాఖ అధికారులకు పలుమార్లు చెప్పిన మా గ్రామం వైపు రాలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిరుత దాడి నుంచి విముక్తి కలిగించాలని వేడుకున్నారు.

సీపీఐ సర్పంచ్ గృహ ప్రవేశ మహోత్సవానికి హాజరైన రామకృష్ణ

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం: దండువారి పల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుకమ్మ నూతనంగా నిర్మించుకొన్న గృహ ప్రవేశ మహోత్సవంలో శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. సిపిఐ సర్పంచ్ రేణుకమ్మ అమె భర్త రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి కత్తి నారాయణస్వామి,శింగనమల నియోజకవర్గం వ్యకాసం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే గోకులం షెడ్లు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: రైతుల మేలు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం కంబదూరు మండలం కదిరి దేవరపల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రైతులకు పాడి రైతులకు చేసింది శూన్యమని, పాడి రైతులకు 10 శాతం సబ్సిడీతో షెడ్లను రెండు లక్షల 30 వేలతో నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కమ్మదూరు రామ్మోహన్ చౌదరి పాల్గొన్నారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి

విశాలాంధ్ర-రాయదుర్గం: పట్టణంలోని ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయులు షేక్ ఫాతిమా జనవరి 10 న జయంతి సందర్భంగా ఘనంగా మైనారిటీ యువ నాయకులు బిఎం నాదల్ ఆయన కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 170 ఏండ్ల క్రితమే బడుగు, బలహీన వర్గాలకు, ప్రత్యేకంగా మహిళలకు విద్యా చాలా అవసరంగా భావించి ఆ దశగా ఉద్యమించిన మహాత్మా జ్యోతిబాపూలే, శ్రీమతి సావిత్రిబాయి పూలే దంపతులతో కలిసి సామాజిక సేవకు నడుంగట్టిన మహనీయురాలు షేక్ ఫాతిమా అని తెలిపారు. పూలే దంపతులకు షేక్ ఫాతిమా ఆశ్రయమిచ్చి ఆదుకున్నారని, మైనారిటీల పేదరిక నిర్మూలన ఒక విద్యా ద్వారా మాత్రమే జరుగుతుందని అన్నారు టిడిపి మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఆర్ చౌదరి పాల్గొన్నారు.

సాఫీగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పామిడి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ మురళిమోహనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధర్ మూర్తి మాట్లాడుతూ రీ సర్వేలో భూ సమస్యలపై వచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామన్నారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేజోష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికి ఉపాధి పనులకు జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పిస్తామని తెలిపారు.మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యలు ఏర్పడకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సంబంధించిన అధికారులకు, సర్పంచులకు సూచించారు. ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలో ఏఐఎస్ఎఫ్ రాయదుర్గం నియోజకవర్గం అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని సంఘం నాయకులు తనిఖీ చేశారు. అనంతరం భోజనం నాణ్యత గురించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయ కులు భీమేష్, రాజ్ కుమార్, సాయికుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-గుత్తి: మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శుక్రవారం ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి నిర్మల,పారిశుద్ధ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య నారాయణ సంఘీభావం తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు రాజా, ఉప కార్యదర్శి ఆది మాట్లాడాతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 36న అమలు చేయాలని, విధులు నిర్వహిస్తూ కార్మికుడు కుటుంబంలో చనిపోతే ఒకరికి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు.ఎస్.రాజా, ఉపాధ్య క్షుడు ఎస్.మురళి, కార్యదర్శి కె.రవి శంకర్, ఉప కార్యదర్శి కె.ఆదినారాయణ,ఉప కార్యదర్శి ఈ.నరసింహా,రాజ్ కుమార్, ముత్యాలు, సాధిక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 11, జనవరి 2025

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

కలెక్టర్ టి.ఎస్. చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి: జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న 76 వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ టి.ఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని, వేదిక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఆహుతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్రాగునీటి వసతి తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సంక్షిప్తంగా ఈనెల 17 న జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి వారికి సమర్పించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాల రూపంలో ఏర్పాటు చేయాలని అదేవిధంగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారి ఆధ్వర్యంలో యధావిధిగా కార్యక్రమాల నిర్వహణతోపాటు కట్టుదిట్టమైన భద్రత చర్యలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు, ప్రజా ప్రతినిధులు, ఇతర అతి థులకు సంబంధించి సిట్టింగ్ అరేంజ్మెంట్స్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే దేశభక్తి గీతాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించేలాగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రెవెన్యూ,విద్యుత్తు, మునిసిపల్, పోలీసు, సంక్షేమ శాఖలు, విపత్తు అగ్నిమాపక శాఖ వైద్య ఆరోగ్య, పౌర సరఫరా తదితర శాఖ అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లాలోని అన్ని శాఖలు హెచ్ఓడిలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సిపిఐ నాయకులు డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

విశాలాంధ్ర-పుట్టపర్తి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనే యులు కోరారు. శుక్రవారం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండల తహసిల్దార్ కార్యాలయం ముందు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. పుట్టపర్తి నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వస్తేనే పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు ,పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాల కేటాయిస్తామని చెప్పి హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఇళ్ల స్థలాలు ఊసేఎత్తలేదు అన్నారు. ముఖ్యమంత్రి స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. అనంతరం తహసిల్దార్ అనుపమకి వినతిపత్రం అందించారు, సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు జయలక్ష్మి, సిపిఐ పట్టణ నాయకులు భాష, గంగాధర్, జయమ్మ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-తలుపుల : మండల వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని శుక్రవారం స్థానిక తహశీల్దార్‌రెడ్డి శేఖర్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ పట్టణాలలో 2 సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు గృహ నిర్మాణం కొరకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోజు కుటమి ప్రభుత్వం హామీ ఇచ్చారని ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలతో పాటు అదనపు అమౌంటు పెంచాలని సిపిఐ నాయకులు తహసీల్దార్‌కు తెలియజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జగలి ఈశ్వరయ్య జిల్లా కౌన్సిల్ సభ్యులు హాసన్, ఎల్వి రమణ సిద్ధయ్య, ఖాదర్ బాషా, నాగభూషణం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలి..

విశాలాంధ్ర-చిలమత్తూరు: సిపిఐ జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి, ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్పకు వినతి పత్రం అందజేశారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం రూ 5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు జయ చంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, గోపాల్, ఆదినారాయణ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తాహసిల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో సిపిఐ నాయకులతో కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని, పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వము ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుపేదలకు హామీ ఇచ్చినందున ప్రభుత్వము వెంటనే హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమం లో సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాముల, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి నరసింహ మూర్తి, సోమందేపల్లి చాంద్ బాషా, శ్రీకృష్ణదేవరాయ కాలనీ మూర్తి, శ్రీరాములు, వెంకట్ రాముడు, కిష్టప్ప పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చండి

విశాలాంధ్ర-సోమందేపల్లి: స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి బాలస్వామి ఇంటి పట్టాల బాధితులతో కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ పట్టణాలలో 2 సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుపేదలకు హామీ ఇచ్చినందున ప్రభుత్వము వెంటనే హామీని నెరవేర్చాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని వీఆర్ఓ అన్నపూర్ణకు అందజేశారు. కార్యక్రమంలో అంజనమ్మ, ఆంజనేయులు, తిమ్మయ్య ఈశ్వరప్ప ఆంజనేయులు సుజాత రజిని లక్ష్మీ నరసమ్మ, శోభ శివమ్మ గంగమ్మ రత్నమ్మ పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం హిందూపూర్ తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ హిందూపురం తాలూకా కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. గత సంవత్సరం నుండి పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వ అధికారులు స్పందించి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు బాబు, రవికుమార్, మారుతి రెడ్డి, చలపతి, కమల్, లక్ష్మీనారాయణ, సాబీరా, ముంతాజ్, నౌషాద్, లింగప్ప, చాంద్ బాషా, శివ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని ఎర్రవంకవాండ ్లపల్లి గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన ఇసుక డంప్ ను శు క్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మతో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వంలో పిఎల్ఆర్ కంపెనీ పైపుల నిర్మాణం కొరకు ఇసుకను నిల్వ ఉంచారు. వారి పనులు ముగిసిన తర్వాత వందలాది టిప్పర్ల ఇసుక మిగలగా అలాగే వదిలి వెళ్లి పోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా లభిస్తుండటంతో అక్రమార్కుల బారిన పడకుండా ఇసుకను కాపాడాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డు లను పరిశీలించారు. వీఆర్వో రఘు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను ప్రారంభించిన జడ్పీటీసీ

విశాలాంధ్ర-అగళి : మండలంలోని మధుడి రాజమ్మ ఆలూడి లక్ష్మీదేవి హల్లికేరా రైతు నాగరాజు పి బ్యాడిగేరా అమ్మాజమ్మ తదితర రైతులకు చెందిన మినీ గోకులం షెడ్లును శుక్రవారం జడ్పీటీసీ ఉమేష్ ఎంపిడిఓ యాదవేంద్ర ఎపిఓ శివన్న ఈసి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. జడ్పిటిసి మాట్లాడుతూ పాడి రైతులను ఆదుకోవాలన్నా సంకల్పంతో మండలానికి ప్రభుత్వం 41 మినీ గోకులం షెడ్లు మం జూరు చేసిందన్నారు. ఈ షెడ్లు రైతులకు చాలా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర జడ్పిటిసి ఉమేష్ ఏపీవో శివన్న టెక్నికల్ ఇంజనీర్ శ్రీధర్ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మైనార్టీ ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షులుగా వాసిమ్ బేగ్

విశాలాంధ్ర-మడకశిర: మైనార్టీ ఐక్యవేదిక మడకశిర నియోజకవర్గ అధ్యక్షులుగా వాసిమ్ బేగ్ ను నియమించినట్లు మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి మైనార్టీలు ఎదుర్కొనే ప్రతి సమస్యలోనూ వారికి మార్గదర్శకుడిగా ముందుండి నడిపిస్తానని చెప్పారు.

భూమి పోయే ... పరిహారం అందక పోయే !

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండలంలోని సోలార్ పవర్ ప్లాంట్ కోసం కేటాయించిన భూమిలో తమ భూమి పోయిందని, గత పది సంవత్సరాలుగా పరిహారం కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పరిహారం అందలేదని పలువురు రైతులు శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు మొరపెట్టుకున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారం అవుతోందని, పరిహారం అందు తుందని ఆశతో ఉన్నామని, రాకపోతే ఆత్మహత్యే శరణ్యమ న్నారు. మా భూముల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేశారని, భూమి పోయే పరిహారం అందకపోయే అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుండి అర్జీలు తీసుకుని నివేదిక తయారు చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ దేవేంద్ర నాయక్‌కు జేసీ సూచించారు.

రైల్వేలైను బాధిత రైతులకు నష్టపరిహారం అందిస్తాం..

విశాలాంధ్ర-గోరంట్ల: రైల్వే లైన్ కోసం ఇప్పటికే సంబంధిత రైతులకు సంబంధించిన భూములను సేకరించా మని తప్పనిసరిగా భూములు తీసుకున్న రైతులకు ప్రభుత్వం ద్వారా భునష్ట పరిహారం అందిస్తామని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ తెలిపారు, శుక్రవారం మండలంలోని వడిగేపల్లి గ్రామ సచివాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సువర్ణ అధ్యక్షతన గోరంట్ల మండలం వడిగేపల్లి గ్రామంలో రైల్వే కి సంబంధించి భూసేకరణలో భాగంగా భూములు పోతున్న రైతులతో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీ ల్దారు మారుతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి, వీఆర్వో అనిల్‌కుమార్, చంద్రకళ, సర్వేయర్ తాతయ్య, స్థానిక సర్పంచ్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలలో పల్లె పండుగలు

విశాలాంధ్ర-హిందూపురం : బేవినాహళ్లి గ్రామ పంచాయతీలో ఘనంగా పల్లె పండుగ నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద, పాడి రైతులకు పశువుల షెడ్డును ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముఖ్య కార్యనిర్వాహకులు శ్రీనివాస్, బాలాజీ, మాజీ సర్పంచ్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి దీపక్‌కుమార్ పశువుల షెడ్డును ప్రారంభించారు. పశు వైద్యులు సుబ్బారాయుడు, సహాయకులు షైక్ అబ్దుల్, రహీం పశువుల యాజమాను లకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రం సహాయ కులు, హరికృష్ణ, ఎంపీటీఏ అశ్విని నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగాలేక వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బలో శివ ప్రసాద్ (45) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సీ కాలనీలోని తన ఇంట్లో పైకప్పుకు ఉరేసుకుని మృతి గత కొన్నాళ్లుగా మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేక బలవన్మ ణానికి పాల్పడ్డాడు. పోలీసులుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

విశాలాంధ్ర-కదిరి టౌన్ : శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా ముక్కోటి ఏకాదశి పర్వదినం వేడుకలు జరిగాయి. వైకుంఠ ఉత్తర ద్వారం ద్వారా భక్తులు గోవింద నామాలు పలుకుతూ స్వామి వారిని సుమారు లక్ష మంది దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అధ్వర్యంలో ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ సిఐ నారాయణ రెడ్డి ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఎమ్మెల్యే దంపతులు ఉదయం 3 గంటలకే స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. హిందూపురం ఎంపీ బికె పార్థసారథి దంపతులు ఉత్తర ద్వారం స్వామివారి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చు కున్నారు.ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడిపశువుల సంరక్షణ రైతుకు లాభదాయకం

-ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-కనగానపల్లి : పాడిపశువుల సంరక్షణ తో రైతుకు లాభదాయకంగా మారుస్తున్న ప్రభుత్వం ఇది అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా కనగానపల్లి, రామగిరి మండలాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న గోకులం షెడ్లను ఆమె అధికారులు, రైతులు, టీడీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించి నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించి లబ్ధిదారులతో వారి అభిప్రాయాలు తెలుసు కున్నారు. ఆ తర్వాత రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పూర్తైన రెండు గోకులం షెడ్లను కూడా కలసి ప్రారంభించారు. అనంతరం కుళ్లాయప్ప అనే రైతు సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట అనుకున్న మేర దిగుబడి రాక నష్టం వాటిల్లినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి పరిహారం వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ ఒక పండుగ వాతావరణంలో మూడు రోజుల పాటు ఈ ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. కనగానపల్లి మండలంలో మొత్తం 109షెడ్లు మంజూరు కాగా 58, రామగిరి మండలంలో 56 మంజూరు కాగా 15 ఇప్పటికే పూర్తయ్యాయని మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం రైతుల విషయంలో ఎక్కువ చొరవ తీసుకుంటోందన్నారు.

ప్రధాని మోడీ నేతృత్వంలో అభివృద్ధి పథంలో దేశం

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి

విశాలాంధ్ర-గోరంట్ల: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ రాష్ట్ర మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రంలో నాసిన్ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ అకాడమిలో 74వ ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్) పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఐఆర్ఎస్ అధికారి ఓఎస్‌హెచ్ అల్కేష్ ఉత్తమ్, ఐపీఎస్ నీరజ్ మిశ్రా, కలెక్టర్ చేతన్, ఎస్పీలు రత్న, రవీంద్ర గుప్తా పాల్గొన్నారు.మొదటిసారిగా నాసిన్ అకాడమీకి వచ్చిన మంత్రి పరేడ్‌ను పరిశీలించి, ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ట్రైనీ ఆఫీసర్లకు బంగారు పతకాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి పంకజ్ చౌదరిమాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకాలు ప్రవేశపెట్టి పేద బలహీనవర్గాల యువతి యువకులకు ఉపాధి కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తుందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ ద్వారా భారతదేశ దిశా దశ నిర్దేశాన్ని మార్చడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ 74వ బ్యాచ్ ద్వారా ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్ ద్వారా బయటికి వచ్చే ఆఫీసర్లు దేశంలోని నలుమూలల వారి సేవలను అందించడంలో పరిపూర్ణులు అవుతారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బాబావలి అధ్యక్షతన మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మరణించిన కార్మికులకు రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.7 లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు పెంచాలని, పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ సమస్య పరిష్కరించాలి రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం 75 వేలు, జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు 26 వేల జీతం,కార్మికులకు పనిముట్లు, బట్టలు, సబ్బులు,చెప్పులు, శానిటైజర్లు,మాస్కులు,గ్లౌజులు,చీపుర్లు,వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమం గంగాధర్ నారాయణస్వామి, మహబూబ్ బాషా,నరసింహ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వెంకటేష్, నాగమ్మ,ముత్యాలు, నరసింహులు, కార్మికులు రాఘవేంద్ర ప్రసాద్, నరసింహ,వెంకటేష్, జబ్బర్, చలపతి, ఓబులేసు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ, రొద్దం మండలాలకు సంబంధించి ఈ విధంగా అంగన్వాడీ వర్కర్లు, మినీ అంగన్వాడి వర్కర్, అంగన్వాడీ హెల్పర్స్ ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవా లని శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఓ శాంత లక్ష్మీ, ప్రకటనలో తెలిపారు, అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు రొద్దం మండలంలోని చెరుకూరు 1 బిసి బి కి కేటాయించామని రోస్టర్ పాయింట్లు 24 ఉన్నాయని తెలిపారు మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు, బూచర్ల ఓసి రోస్టర్ పాయింట్ 28, అంగన్వాడీ హెల్పర్ ఉద్యోగాల కోసం రొద్దం 2 బిసి బికి కేటాయించగా రోస్టర్ పాయింట్లు 81 ఉన్నాయి, మోపర్లపల్లి ఒసికి కేటాయించగా రోస్టర్ పాయింట్లు 92 ఉన్నాయి, ఆర్ కొట్టాల బిసిడికి కేటాయించగా రోస్టర్ పాయింట్లు 93 ఉన్నాయి, పెనుకొండ మండలంలోని తోటిగేరా బిసిఈకి కేటాయిం చగా రోస్టర్ పాయింట్లు 98 ఉన్నాయి, 10వ తేదీ నుంచి 25వ తారీకు సాయంత్రం వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పదవ తరగతి పాసై ఉండాలని, 1-7-2024 నాటికి 21 సంవత్స రాలు నిండి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలన్నారు.

విశాలాంధ్ర-గుడిబండ : అమరాపురం గుడిబండ మండలా లలోని కె.గొల్లహట్టి, కనకనపల్లి, మోరబాగల్ 2, తిమ్మలాపురం అంగనవాడి హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ శాంతలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఆన్లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పేదలకు కంటి వెలుగు ప్రసాదించడమే ధ్యేయం

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యము అని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయ సింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. శుక్రవారం పట్టణం లోని సాంస్కృతిక మండలి లో ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) నిర్వహించబడు ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఆపరేషన్ల వైద్య శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ- అనంతపురం జిల్లా వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి నిపుణుల సలహాలతో,కళ్ళలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. ఈ హెచ్ ఎస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు మిగిలిన ఏ కార్డులు కూడా తీసుకొని రావలసిన అవసరం లేదన్నారు. వైద్య శిబిరం దాతలుగా సింగం రెడ్డి వెంకట లక్ష్మమ్మ, సింగం రెడ్డి రామిరెడ్డి-రిటైర్డ్ టీచర్, కోడలు సింగం రెడ్డి మమత, కుమారుడు సింగంరెడ్డి వెంకటరామిరెడ్డి, క్యాంపు చైర్మన్‌గా విజయభాస్కర్ వ్యవహరి స్తారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణమూర్తి, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, శివయ్య, గట్టు హరినాథ్, రత్నశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయము నుండి వచ్చు భక్తాదులకు రోటరీ క్లబ్ తరఫున దాదాపు 500 మందికి భోజనపు ప్యాకెట్లతోపాటు, వాటర్ ప్యాకెట్స్ కూడా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

వచ్చే నెల 1,2న ఎంప్లాయిస్ మెగా షటిల్ టోర్నీ

విశాలాంధ్ర-ధర్మవరం: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ,2వ తేదీలలో ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతిలో ధర్మవరం ఎంప్లాయిస్ మెగా షటిల్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరుగుతుందని. ఈ టోర్నమెంట్లో ధర్మవరం పట్టణంలో గల ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ప్రసాద్ ,ప్రవీణ్, నరసింహమూర్తిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆర్డిఓ మహేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. టోర్నీలో పాల్గొనే వారు ఈనెల 25వ తేదీలోగా ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10, వేలు రెండవ బహుమతి రూ.5వేలు, టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెమెంటో ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9701213058 , 80734 59509, 8179774420లో సంప్రదించాలన్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇమామ్ ఆదేశాలతో చలికాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ దాదా పీర్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం మైలేపల్లి గ్రామంలో ఉన్న కరుణ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ రోషన్ జమీర్ హాజరయ్యారు. కరుణ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు మానవసేవే మాధవసేవ అనే నినాదంతో వృద్ధులకు దుప్పట్లు అందజేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ నాయకులు కలీం, ఇనాయతుల్లా, జాఫర్ , ముహమ్మద్ గౌస్ , షబ్బీర్ , మస్తాన్ వలి నబిరసూర్ , ముంతు తదితరులు పాల్గొన్నారు .

చెన్నకేశవుడి సేవలో వివేకానంద డిగ్రీ విద్యార్థులు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వామి సేవలో పాల్గొన్నారు. తెల్లవారుఝాము నుండే నిలబడిన ఉన్న భక్తులను క్యూలో పంపుతూ పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులకు అవకాశం లేకుండా భక్తులకు స్వామి దర్శనం కలిగేలా సహకరించారు. వీరికి దేవాలయ అద్యాక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీష్,, ఆలయ ఈవో వెంకటేశులు,కమిటీ సభ్యులు కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి,డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్ష వర్ధన్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

దళితుల సమస్యను తీర్చిన ఉపముఖ్యమంత్రి

విశాలాంధ్ర-ధర్మవరం: తాడిమర్రి మండలం చిత్రావతి రిజర్వాయర్ ముంపు గ్రామమైన మరిది మేకల పల్లిలో కేవలం దళితులకు మాత్రమే పారితోషకం ఇవ్వలేదని గత వైసిపి ప్రభుత్వంలో బాధితులు నష్టపోయారు. శుక్రవారం బాధితులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 2022లో తిరుపతిలో నిర్వహించిన జనవాణీ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తీసుకొని వెళ్లడం జరిగింది. దీంతో ఇప్పటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిమర్రి దళితులకు ఒక్కొక్కరికి పది లక్షల రూపాయలు చొప్పున మొత్తం 119 మందికి పారితోషకం ఇచ్చారన్నారు. ఈ మేరకు మధుసూదన్ రెడ్డికు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చడంతో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా మధుసూదన్ రెడ్డి సమక్షంలో పట్టణంలోని 25వ వార్డ్ పార్థసారధి నగరకు చెందిన 30 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చిలక మధుసూదన్ రెడ్డి జనసేన పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఏ ఆపద వచ్చినా ముందు ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డిష్ రాజు, సంకు, అఖిల్, జీవన్, ఆది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 11, జనవరి 2025

చెట్లను నరికే సంస్కృతి వీడాలి

విశాలాంధ్ర - నార్పల : చెట్లను నరికే సంస్కృతి వీడాలి అని అలం నరస నాయుడు, వెంకట శివుడు యాదవ్ పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం కొండుగారికుంట గ్రామానికి టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు తోటలో 1000కి పైన అరటి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు అక్కడికి వెళ్లి అరటి చెట్లు నరికివేతకు గురైన తోటను పరిశీలించారు. కన్న బిడ్డల్లా పెంచుకున్న అరటి చెట్లను నరికి వేయడం చాలా దారుణం అన్నారు. ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలాన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాలరంగయ్య, శ్రీరామ్ రెడ్డి,శివశంకర రెడ్డి,బాబు,టీడీపి విజయ్, చంద్ర, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన పశుగ్రాసం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని కొళగానహళ్లి గ్రామ శివారులో పశుగ్రాసం అగ్నికి ఆహుతైన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కావలి రామరాజుకు సంబంధించిన 10 ఎకరాల పశుగ్రాసాన్ని గ్రామ సమీపంలోని వాము ఏర్పాటు చేసి పెట్టాడు. గుర్తు తెలియని వ్యకు బిలు నిప్పు పెట్టడం వల్ల పశుగ్రాసం ఆహుతై పోయింది. స్థానికులు వెంటనే గమనించి స్థానికంగా ఉండే వ్యవసాయ బోర్ల నీటితో ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకుండా పశుగ్రాసం కాలిపోయింది. అధికారులు పరిశీలించి బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

ఘనంగా తిరుకళ్యాణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఈనెల ఏడవ తేదీ నుండి 11వ తేదీ వరకు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు స్వామివారికి (మూలవిరాట్ విగ్రహానికి) పంచామృతాభిషేకము అర్చన వైకుంఠ ద్వార పూజ, ద్వార ప్రవేశము పలు కార్యక్రమాల్ని ఘనంగా అర్చకులు మోహనస్వామి, రాజేష్ ఆచార్యులు నిర్వహించారు. అదేవిధంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను కూడా ఘనంగా నిర్వహిస్తూ ఉత్తర ద్వారము, దక్షిణ ద్వారం వెంబడి భక్తాదులకు స్వామివారి దర్శనాన్ని కమిటీ వారు కల్పించారు. అనంతరం సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులకు తీరు కల్యాణ మహోత్సవ వేడుకలను భక్తాదులు నడమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, జింక రాజేంద్రప్రసాద్, చెన్నం శెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్ కుమార్‌తో పాటు శ్రీవారి సేవకులు, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాడిపశువుల పెంపకంతో రైతుల ఆర్థికాభివృద్ధి

విశాలాంధ్ర-రాప్తాడు : పాడి పశువుల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి పొందవచ్చని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి తెలిపారు. పల్లెపండుగలో భాగంగా శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి, గాండ్లపర్తి, జి.కొత్త పల్లి, పుల్లలరేవు, హంపాపురం, బండమీదపల్లి, ఎర్రగుంట పంచాయతీల్లో గోకులం షెడ్లను ఏపీఓ సావిత్రి, ఈసీ మురళీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా సబ్సిడీ కింద మంజూరు చేసిన 23 గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శీనా, డిష్ వెంకట్రాముడు, ప్రసన్నాయ పల్లి శీనా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పురాతన ఆలయంలో ఆలయ ఈవో వెంకటేశులు, అటహాక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, భక్తాదులు, దాతల సహకారంతో అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేలాదిమంది భక్తాదులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించుకున్నారు. ఆలయాన్ని వివిధ పొలాలతో అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. వైకుంఠ ఏకాదశి వేడుకలకు విరాళంగా ఇచ్చిన దాతలను ఆలయ ఈవో తో పాటు చైర్మన్ ఘనంగా సన్మానించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలు, వెంకటేశ్వర స్వామి పాటలతో భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆర్డీవో మహేష్, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, డీఎస్పీ శ్రీనివాసులు, ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరిబాబు, తదితర అధికారులు, అనధికారులు, అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. డి.ఎస్.పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తూ, భక్తాదులను వరుసగా స్వామివారి దర్శనం కోసం పంపించారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులు వాలేటీర్లుగా పనిచేస్తూ భక్తాదులకు సేవలను కొనసాగించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తాదులు, దాతలు, ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

విశాలాంధ్ర–ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ పాడి రైతుల కోసం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఆత్మకూరు మండలంలో 109 షెడ్లను మంజూరు చేయించింది. నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లును శుక్రవారం ఆత్మకూరు, ముట్టాల, గొరిదిండ్ల, పియాలేరు, సిద్దరాం పురం, వడ్డిపల్లి, మదిగుబ్బ, సనప, బి.యాలేరు గ్రామా లలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్లను ఎంపీడీవో లక్ష్మి నరసింహులు, ఏపీవో సుజాత, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూ పురం పార్లమెంట్ అధికారులు శశాంక్ బాబు, తెలుగుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి పరిశీలించాచు.

యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి..

విశాలాంధ్ర-ఉరవకొండ : స్వామి వివేకానంద జీవితం నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని బంగారు భవిష్య త్తుకు బాటలు వేసుకోవాలని నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట తెలిపారు. స్వామి వివే కానంద జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం శ్రీ కరిబసవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గం విద్యార్థిని, విద్యార్థులకు వకృత్వం, వ్యాసరచన, భగవద్గీత, యోగా సనం,వేషధారణ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాల నుండి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలకు స్వామి వివేకానంద జయంతి రోజు జనవరి 12న షిరిడి సాయి బాబా కళ్యాణ మండపంలో బహుమతులు అందజేస్తామన్నారు. నిస్వార్థ సంస్థ సభ్యులు దివాకర్,చంద్రశేఖర్, ఓబులేష్, శ్రీనివాసులు, శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసు నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర-తాడిపత్రి: మహిళలను కిడ్నాప్ చేసి దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గన్నవారిపల్లి కాలనీ చెందిన రేణుకను గురువారం ఇగుదూరు గ్రామం వద్ద కిడ్నాప్ చేసి, ఆమెపై దాడి చేసి, బంగారు దొంగతనం చేసిన కేసు నిందితులు వీరాంజనేయులు, రాధమ్మ, భూలక్ష్మి, దశరథలను చుక్కలూరు క్రాస్ నందు అరెస్ట్ చేసి దొంగలించిన చైను, కమ్మ, మాటీ దాదాపు 3.2 తులాల బంగారమును, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించామన్నారు.

చిన్నారుల ఆధార్ జనరేషన్ నెలాఖరులోపు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలో 0-6 ఏళ్ల చిన్నారుల ఆధార్ జనరేషన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆధార్ డిఎల్ఎంసి సమావేశాన్ని నిర్వహించగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0-6 ఏళ్ల చిన్నారులు 75,287 మంది ఉండగా, ఇప్పటివరకు 5,798 మంది చిన్నారుల ఆధార్ జనరేషన్ పూర్తి కావడం జరిగిందన్నారు. అందులో పెండింగ్ ఉన్న 69,489 మంది చిన్నారుల ఆధార్ జనరేషన్ జనవరి నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఐపిబిబి పోస్టల్ బ్యాంకు పేమెంట్, సిఎస్సి సిబ్బంది ఇంటింటికి, అంగన్వాడి కేంద్రాలకు వెళ్లి చిన్నారుల ఆధార్ జనరేషన్ పూర్తిగా చేపట్టేలా చూడాలన్నారు.ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండినా ఆధార్ కార్డులు లేని వారికి కూడా ఎంపీడీవో తహసిల్దార్ కార్యాలయాల్లో అప్రూవల్ చేయించి ఆధార్ కార్డులు చేయించాలన్నారు. ఆధార్ సేవా కేంద్రాల్లో ఆధార్ ఎన్రోల్మెంట్,మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ తదితర వాటి గురించి ఎంత అమౌంట్ తీసుకోవాలనే దానిపై ప్రతి సచివాలయంలో, తహసిల్దార్ కార్యాలయంలో, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి, డిఆర్ఓ ఎ.మాలోల,ఐసిడిఎస్ పిడి వనజ అక్కమ్మ, డీఈవో ప్రసాద్ బాబు, డిఆర్డిఎ పిడి ఈశ్వరయ్య, ఆధార్ జిల్లా నోడల్ అధికారి నారపరెడ్డి, సిఎస్సి డిస్టిక్ మేనేజర్ సాగర్, లీడ్ బ్యాంకు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని విజన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాడికి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఈరన్న పాల్గొని విజన్ విద్యార్థుల ముగ్గుల పోటీలను, బొమ్మల కొలువు, కోలాటం కార్యక్రమాలను వీక్షించారు తదుపరి విజన్ విద్యార్థులచే బుర్రకథ, హరిదాసు, పిట్టలదొర, శోదమ్మ వంటి సంప్రదాయ గెటప్‌లు, ఆయా పాత్రలలో విద్యార్థుల వేశ, భాషలు చూపరు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక శాస్త్రీయ నృత్యా లు సైతం అలరించాయి. తదుపరి ముగ్గుల పోటీలు, గాలి పటం తయారీ, రూ బిక్ కాంపిటేషన్ లలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు,తల్లిదండ్రులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజన్ హై స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ తీరం పురం నీలకంఠ, ఆది నారాయణ, గుండా నారాయణ స్వామి, వెంకట స్వామి, విజన్ విద్యార్థుల తల్లిదండ్రులు,విజన్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విజన్ వికసిత్ ద్వారా భారత్ ముందంజ

విశాలాంధ్ర-గోరంట్ల: నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్), పాలసముద్రం, భారతీయ రెవెన్యూ సర్వీస్ (కస్టమ్స్ మరియు పరోక్ష పన్నులు) అధికారుల 74వ బ్యాచ్ యొక్క ప్రతిష్ఠాత్మక పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంవారి కఠోర శిక్షణ ముగింపును భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడే కర్మయోగులుగా వారి ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ బ్యాచ్‌లో 25 మంది పురుష అధికారులు మరియు 10 మంది మహిళా అధికారులతో సహా మొత్తం 35 మంది అధికారులు ఉన్నారు. వీరు ఈ కార్యక్రమంలో అసాధారణమైన క్రమశిక్షణ నిబద్ధతను ప్రదర్శించారు. ఈ పరేడ్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సి బి ఐ సి) చైర్‌పర్సన్ సంజయ్ కుమార్ అగర్వాల్, సి బి ఐ సి బోర్డు మెంబర్స్ శశాంక్ ప్రియ మరియు యోగేంద్ర గార్గ్, నాసిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్దిన్ పన్మయి మరియుసి బి ఐ సి సీనియర్ అధికారులు హాజరయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ, వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో మరియు భారత ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడంలో కీలక బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్న అధికారులను అభినందించారు. ఆర్థిక పురోగతి మరియు సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ విజన్ వికసిత్ భారత్ ను ముందుకు తీసుకెళ్లగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సీబీఐసి చైర్‌పర్సన్ సంజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, అధికారులు తమ విధుల్లో నిర్ణయాత్మకత, వినూత్నత మరియు అభిప్రాయాలను /సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని ప్రోత్సహించారు. దేశ పన్ను మరియు వాణిజ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో వారి పాత్రను ప్రత్యేకంగా చెప్పారు, నాసిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్దిన్ పన్మయి మాట్లాడుతూ, అధికారులను అభినందిస్తు మరియు దేశవ్యాప్తంగా తమ విభిన్న పాత్రల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 74వ బ్యాచ్‌కు చెందిన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేసి సత్కరించారు,ఆర్థిక మంత్రి బంగారు పతకం: విద్యా విషయాలు, హాజరు మరియు శారీరక శిక్షణలో సమతుల్యత కనబరిచినందుకు కె. ప్రసాద్ కృష్ణన్‌కు లభించింది.చైర్మన్ బంగారు పతకం: రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు శ్రీ సాహిల్ ఖరేకు లభించింది.కౌశల్య నారాయణన్ స్మారక బంగారు పతకం: శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన మహిళా అధికారి ఏం ఏస్ ముసలే అనుజా అనంత్‌కు లభించింది,ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ బంగారు పతకం: శిక్షణ అంతటా స్థిరమైన పనితీరు మరియు అద్భుతమైన ప్రవర్తన కనబరిచినందుకు పంకజ్ గుజర్‌కు లభించింది, ఎస్.కె. ఉపాధ్యాయ్ స్మారక బంగారు పతకం: ఆదర్శవంతమైన క్రమశిక్షణ, ప్రవర్తన మరియు సమిష్టి కృషి కనబరిచినందుకు వినీత్ బన్సోడ్‌కు లభించింది.ఈ పరేడ్‌లో అధికారులు ప్రదర్శించిన కవాతులు వారి వృత్తి నైపుణ్యం మరియు క్రమశిక్షణను చాటిచెప్పాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించే వారిగా మరియు దేశ రక్షకులుగా తమ పాత్రలను స్వీకరిస్తూ, సమగ్రత మరియు సేవ యొక్క విలువలను కాపాడతామని అధికారులు ప్రమాణం చేసారు, ఈ కార్య క్రమంలో కలెక్టర్ టీ ఏస్ చేతన్,ఎస్పి వి రత్న ఐపీఎస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుని దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్యగుట్టలోలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ ఆధ్వర్యంలో భక్తాదులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ కమిటీ, భక్తాదులు, దాతల పేరిటన ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సంకారపు జయ మాట్లాడుతూ పట్టణంలో 600 సంవత్సరాల క్రిందట వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పునర్నిర్మానం అవుతుందని, ప్రస్తుతం కమిటీ వారు దాతల సహాయ సహకారముతో నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి భక్తుడు తనకున్న దానిలో ఆలయానికి వస్తురూపేనా నగదు రూపేనా ఇవ్వాలని వారు కోరారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తి కావాలంటే దాతలు మరింత ముందుకు రావాలని వారు విన్నవించుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్తర ద్వారం తరపున భక్తాదులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో గద్దం పార్థసారథి, డాక్టర్ నరసింహులు, అంబటి అవినాష్, అజంతా కృష్ణ ,పుట్లూరు నర్సింహులు, జయప్రకాష్, అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం

విశాలాంధ్ర-యాడికి : యాడికి తహసిల్దార్ కార్యాలయం నందు మండల డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేయుచున్న సుంకన్న ఈనెల 1వ తారీఖున ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడినందున అప్పటి నుండి ఇప్పటి వరకు అనంతపురంలోని కిమ్స్ సవెర ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, తహసిల్దారు ప్రతాపరెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు అందరు కలిసి మానవతా దృక్పథంతో యాభై వేల రూపాయలను సుంకన్న సోదరుడు అయిన వెంకటేష్ సురేంద్ర గార్లకు మెరుగైన చికిత్స కొరకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సుంకన్న సోదరులు ఆర్థిక సహాయం అందించినందుకు తాహసిల్దార్ వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

గోకులం షెడ్లు ప్రారంభం

విశాలాంధ్ర-అమరాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు సంబంధించిన గోవులు వర్షాలకు తడవకుండా ఉండటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని గోకుల షెడ్లను రైతులకు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలకి గోకుల షెడ్లకు ఆదేశాలు జారీచేసి పల్లె ప్రాంతాల్లో అవసరమున్న రైతులకు మంజూరు చేశారు. అమరాపురం మండలంలో కూడా రైతులకు 80 శాతం సబ్సిడీతో గోకుల షెడ్లను మంజూరు చేసింది. శుక్రవారం మండలంలోని పుల్లికుంటలో రెండు, నాగోనపల్లిలో ఒకటి, షెడ్లను అధికారులు, తెదేపా నాయకులు పాల్గొని ప్రారంభించారు. ఇందులో ఎంపీడీవో రామారావు స్వామి, ఉపాధి హామీ సిబ్బంది మరియు స్థానిక నాయకులు తెదేపా కన్వీనర్ గణేష్, సీనియర్ నాయకులు నరసింహమూర్తి, శివ రుద్రప్ప, వాల్మీకి మంజునాథ్, డీలర్ తిప్పేస్వామి, మధనకుంట రఘు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరిగడ్డి టెండర్లను దక్కించుకున్న తిప్పేస్వామి

విశాలాంధ్ర-కణేకల్లు: స్థానిక ఎస్ ఎస్ ,ఆర్ డి ఏ ఫారంకు చెందిన 140 ఎకరాల నందు ఖరీఫ్ 2024 సీజన్కు సంబంధించిన వరిగడ్డిని బహిరంగ వేళము ద్వారా విక్రయించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు మారెంపల్లి గ్రామం ఎస్ ,తిప్పేస్వామి, కే,మహేష్ ,సిద్దన్న స్వామి కనేకల్ గ్రామం నందు వై,లోకేష్ రెడ్డి వీళ్ళందరూ పాల్గొనగా వేలంపాటలో అత్యధికంగా ఒక ఎకరాకు 1205 రూపాయలు చొప్పున పాడి టెండర్ తగ్గించుకోవడమైనది ఎస్, తిప్పేస్వామి. ఈ కార్యక్రమంలో డిడిఏ మద్దిలేటి, డిఆర్సి అనంతపురం నారాయణ నాయక్, ఫారం సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

విశాలాంధ్ర-అమరాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొందరు అధికారులు ప్రోటకాలను పాటించడం లేదని విశ్వసనీయ సమాచారం. కొందరు ప్రజాప్రతినిధులకు ఉన్న అధికారాలను తుంగలో తొక్కుతున్నట్లు సమాచారం. మండలంలో ఏవైనా ప్రభుత్వ పథకాల కార్యకలాపాలు కానీ, ప్రారంభోత్సవాలకు కానీ ప్రజాప్రతినిధులను కనుమరుగు చేస్తున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం అధికారుల విధి, అయితే వారిని చిన్నచూపు చూడడం ఎంతవరకు సబబు అనే వాదన వినిపిస్తోంది. శుక్రవారం అమరాపురం మండలం లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోకుల షెడ్ల ప్రారంభోత్సవంలో ప్రజా ప్రతినిధులు కనబడలేదంటూ సమాచారం. మండలంలోని పులికుంట గ్రామంలో రెండు గోకుల షెడ్లు నాగోనపల్లిలో ఒకటి ప్రభుత్వ పథకాలతో నిర్మితమైన గోకుల షెడ్ల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు కనబడకపోవడం చర్చనీ అంశమైంది.

లక్ష్మీ నరసింహుడిని దర్శించుకున్న జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి

విశాలాంధ్ర - ఉరవకొండ : మండలంలో వెలసిన ప్రసిద్ధ దేవాలయం పెన్న హొబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని శుక్రవారం జిల్లా స్పెషల్ కోర్ట్ జడ్జి కే.శివశంకర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులను ఆలయ ఈవో రమేష్ బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి సన్మానించి లక్ష్మి నరసింహ స్వామి చరిత్ర గురించి తెలియజేశారు.

తాగునీటి సమస్య తీరిపాయే

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ టౌన్ వడ్డీ పేటలొ నెలకొన్న నీటి సమస్య తీర్చమని ఆ ప్రాంత మహిళలు తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ దృష్టికి తీసుకురాగా ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లి అధికారులతో మాట్లాడి బోరు వేయించి త్రాగునీటి సమస్య తీర్చి కృషి చేసినందుకువడ్డీపేట వాసులు క్లస్టర్ ఇన్చార్జ్ తుమ్మల మనోహర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన జడ్పీటీసీ

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో శుక్రవారం చిన్న పిల్లలకు ఆరోగ్య కార్యకర్తలు వేస్తున్నా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జెడ్పిటిసి ఉమేష్ పరిశీలించారు. చిన్నపిల్లల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని జడ్పిటి ఉమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలోని ప్రజలు, ఆరోగ్యంగా ఉండాలని పిల్లలకు సకాలంలో వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త పాటించాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల ప్రారంభం

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా రైతులకు సబ్సిడీ గోకులం షెడ్లను మంజూరు చేసింది, సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ ఉపాధి హామీ నిధులతో షెడ్డు నిర్మించుకుని నిర్మాణం పూర్తి చేసుకొని ప్రభుత్వ అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులతో షెడ్డును ప్రారంభోత్సవం చేశారు, కూటమి ప్రభుత్వం చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటూ వారికి ఉపాధిని కల్పిస్తున్నాడని రైతుల కొనియాడారు, ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, పెనుగొండ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ నరేష్, ఉత్తమ్ రెడ్డి, బాలకృష్ణ చౌదరి, ఈశ్వర్ రెడ్డి, శంకర, ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో నరేంద్ర, ఏపీఓ వరప్రసాద్, ఫీల్ అసిస్టెంట్ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన టీడీపీ మండల అధ్యక్షుడు

విశాలాంధ్ర-గుడిబండ:మండలం పరిధిలోని జంబలబండ గ్రామపంచాయతీలోని కె.డి.పాళ్యం గ్రామానికి చెందిన రైతు యశోదమ్మ కు చెందిన మినీ గోకులం షెడ్డును తెదేపా మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప తెదేపా స్థానిక నాయకుడు మాజీ సర్పంచ్ శ్రీనాథ్ మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ క్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలని సంకల్పంతో రైతులకు చాలా ఉపయోగపడే విధంగా మినీ గోకుల షెడ్లను ప్రారంభించిందని మండలంలోని గోకులం షెడ్లు మంజూరైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జయరామప్ప,ఏపీఓ భార్గవి,టెక్నికల్ అసిస్టెంట్లు కాచికుంట వెంకటేష్,సతీష్, తిరుమల గౌడ్,దాసన్న,పవిత్ర,పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవ వేడు కలు భక్తాదులు కార్యవర్గ సభ్యులు, ఆలయ కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీ, గణపతి సచ్చిదానంద దత్త జాన బోధ సభా ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నుండి రాత్రి వరకు భక్తాదుల సందడితో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు సుదర్శనాచార్యులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ భక్తాదులకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు దాతలుగా నిర్వహించిన అందరిని కూడా ఘనంగా సన్మానించారు. ఆలయ అలంకరణ, వెంకటేశ్వర స్వామి అలంక రణ భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలను విజయవంతం చేసిన దాతలకు, ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన అందరికీ కూడా కార్యవర్గ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలను తెలియ జేశారు. కార్యవర్గ సభ్యులు మే టీకాల కుల్లాయప్ప, శంకర సంజీవులు, గుద్దుటి రామాంజనేయులు, రంగా శ్రీనివాసులు, దత్తా శివ, బేల్లే నాగప్ప, సాగసురేష్ ,ఎస్ జి ఎస్ వాలంటీర్లు, మాతృమండలి వారు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభించిన ఇంచార్జ్ ఎంపీడీవో

విశాలాంధ్ర-శెట్టూరు: పాడి రైతుల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద గోకులం షెడ్లను మంజూరు అయినా ఇంచార్జి ఎంపీడీవో రఘు రామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలో అయ్యగార్లపల్లి, అనుంపల్లి గ్రామంలో నూతనంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన క్యాటిల్ షెడ్లను ఇన్చార్జ్ ఎంపీడీవో రఘు రామారావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాడి పశువుల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి పొందవచ్చని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా 42 గోకులం షెడ్లును మంజూరైనవి వాటిని త్వరగా కట్టించుకుని సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో రైతు శాంతమ్మ, ఈసీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, టెక్నికల్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు పెద్దపీట

విశాలాంధ్ర - నార్పల: మండలం పరిధిలోని బొందలవాడ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్డును వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు ప్రారంభించాడు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతాంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, వెటర్నరీ అసిస్టెంట్ గంగాధర్, రైతు వెంకటరమణ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు ఒక జెసిబిని పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర-శింగనమల : మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను ఒక జెసిబిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తర లించినట్లు శింగనమల ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల మేరకు శింగనమల మండలంలోని రాచేపల్లి గ్రామం వద్ద నదీ పరివాహక ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను వాటికి ఇసుకను లోడు చేస్తున్న ఒక జెసిబిని పట్టుకొని శింగనమల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.ఒకటిప్పర్ టీడీపీ నాయకుడుఉల్లికల్లు రంగారెడ్డికి సంబంధించినదని, మరొక టిప్పర్ జెసిబి పెరవలి మారుతి నాయుడుకి సంబంధించినవని, వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని 27 వార్డులో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి చొరవతో విద్యుత్ సమస్యలు పరిష్కరించ బడ్డాయని 27వ వార్డు కౌన్సిలర్ రేష్మా ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27వ వార్డు కాలనీలో లో ఓల్టేజీ, ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సప్లై ఆగిపోవడం తదితర విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ఎమ్మెల్యే జేసి అస్మిత్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము. ఎమ్మెల్యే చొరవ తీసుకొని విద్యుత్ అధికారులకు విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లాయర్ హనీఫ్ విద్యుత్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి లైన్మెన్ పాల్గొన్నారు.

పశువుల షెడ్లను ప్రారంభించిన ఎంపీడీవో,ఎమ్మార్వో

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మినీ గోకులాలు, పశువుల షెడ్లు ,గొర్రెల షెడ్లు, ఎంపీపీ యోగేశ్వరి, తాసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో నిర్మల కుమారి, వెంకటలక్ష్మమ్మ, ఏపీవో శ్రీదేవి, లు అత్యంత పవిత్రమైన రోజైన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఉన్న షెడ్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.